క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ సమావేశం రేపు

బంగారుపాళెం: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమావేశాన్ని జయప్రదం చేయాలని మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి శనివారం తెలిపారు. తవణంపల్లె మండలం కాణిపాకం క్రాస్ సమీపంలోని నారాయణాద్రి కల్యాణమండపంలో సోమవారం ఉదయం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందన్నారు. రాయలసీమ జిల్లాల పార్టీ సమన్వయకర్త పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు భూమనకరుణాకరరెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు. మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జర్నలిస్టుల నూతన కార్యవర్గం

బంగారుపాళెం: అక్రిడిటేషన్ జర్నలిస్టుల మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో సీనియర్ జర్నలిస్టు ప్రతాప్‌సేన్ అధ్యక్షతన మండల అక్రిడిటేషన్ జర్నలిస్టుల సమావేశం నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా ప్రతాప్ సేన్, మండల అధ్యక్షులుగా అరవింద్, ప్రధాన కార్యదర్శిగా శివశంకర్, ఉపాధ్యక్షులుగా ఉమాపతి, రామచంద్ర, కోశాధికారిగా శంకరన్, సంయుక్త కార్యదర్శులుగా బాలయ్య, చాంద్‌బాషా, జ్యోతిరామ్‌తో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 28 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 28 మందికి రూ.2.80 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శనివారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు గత రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 28 మందిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.2.70 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కాగా గత 11నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన 568 మందిపై కేసులు నమోదుచేస్తే.. న్యాయస్థానం రూ.56.90 లక్షల జరిమానాలు విధించిందని సీఐ నిత్యబాబు తెలిపారు.

క్రీడా జ్ఞాన పరీక్షలు సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా ఆసక్తి ఉన్న క్రీడాకారులు క్రీడా జ్ఞాన పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. క్రీడాభారతి ఆధ్వర్యంలో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్ష ఈ నెల 8వ తేదీన ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ఏదో ఒక సమయంలో నిర్వహిస్తారని చెప్పారు. 25 నిమిషాల పాటు నిర్వహించే ఈ పరీక్షలో 50 ప్రశ్నలు ఉంటాయన్నారు. జిల్లాలో 12 సంవత్సరాల వయస్సు, ఆపై వారు ఈ పరీక్షలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు www.kreedabharathi.org వెబ్‌సైట్‌లో ముందస్తుగా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఈ పరీక్షల్లో ఎంపికయ్యే వారికి మొదటి అవార్డుగా రూ.లక్ష, రెండో అవార్డుగా రూ.50 వేలు చొప్పున ఇద్దరికి, మూడో అవార్డుగా రూ.25 వేలు చొప్పున ఆరుగురికి, నాలుగో అవార్డుగా రూ.11 వేలు చొప్పున 11 మందికి ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ సదావకాశాన్ని జిల్లాలోని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మంగళ విద్యావాణి 31వ సంచిక ఆవిష్కరణ

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మంగళవిద్యా వాణి 31వ సంచికను హెచ్ఎం రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ప్రముఖ అవధాని ఆముదాల మురళి, అమృత భారతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్‌రెడ్డి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ, విద్యార్థులు సోమరితనం, వాయిదా వేయడం లాంటి అంతర్గత శత్రువులను జయించినప్పుడే గొప్ప విజయాలు అందుకోగలుగుతారని సందేశమిచ్చారు. సంచికలో విద్యార్థులు రాసిన వ్యాసాలన్నీ చక్కగా ఉన్నాయని అభినందించారు. పుస్తక పఠనం సంపూర్ణ జ్ఞానాన్నిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గణిత అవధాని అరుణశివప్రసాద్, ఉపాధ్యాయులు రమాదేవి, సంజీవి, పిళ్లారప్ప, సంపంగి, భారతి పాల్గొన్నారు.

కాణిపాకం క్యాలెండర్ ఆవిష్కరణ

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం 2025 సంవత్సర నూతన క్యాలెండర్స్‌ను ఎమ్మెల్యే మురళీమోహన్ ఆవిష్కరించారు. చిత్తూరు నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం నూతన క్యాలెండర్లను ఆవిష్కరించారు. దేవస్థానం చరిత్ర, ప్రాధాన్యత, భక్తుల సేవలకు అంకితభావంతో రూపొందించిన ఈ క్యాలెండర్‌లో పండుగలు, విశేష తేదీలతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాల వివరాలు పొందుపరిచినట్లు ఈఓ గురుప్రసాద్ తెలిపారు.



క్యాలెండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే, ఈఓ



బంగారుపాళెం: వర్షానికి వెలవెలపోయిన వారపు సంత

రోజంతా జడివాన..

ఫెంగల్ తుపాను ప్రభావంతో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో వర్షాలు కురిశాయి. ఉదయం నుంచే జడివాన ప్రారంభం కావడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. రైతులు పంటలను కాపాడుకోవడానికి అవస్థలు పడ్డారు. చిరు వ్యాపారులు, రోజు కూలీలు పనుల్లేక ఇంటిపట్టునే ఉండిపోయారు. బంగారుపాళెంలో వారపుసంత కొనుగోలుదారుల్లేక వెలవెలపోయింది. తవణంపల్లెలో 24.8 మి.మీ వర్షపాతం నమోదైంది. చిత్తూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

- తుపాను ప్రభావంతో వర్షం
- ఉదయం నుంచి ఎడతెరపిలేని వాన
- స్తంభించిన జనజీవనం
- చిత్తూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

చిత్తూరు అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా చిత్తూరు నగరంలో శనివారం ఉదయం నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది. నగరంలో ఎక్కడికక్కడ దినసరి కూలీలకు పనుల్లేకుండా ఆగిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్లపై వ్యాపారాలు చేసుకునే రైతులు, తోపుడు బళ్ల వ్యాపారులకు ఇబ్బందులు తప్పలేదు. తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కార్పొరేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. వర్షాలతో నగరంలోని లోతట్టు ప్రాంతాల పరిస్థితిని కమిషనర్ నరసింహప్రసాద్ పరిశీలించారు. నగర పరిధిలోని అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నీవానది పరివాహక ప్రాంతాలైన వీరభద్ర కాలనీ, తేనెబండ, కైలాసపురం ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్, ప్రజారోగ్య శాఖ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో, నీవా నది పరీవాహక ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వర్షపు నీరు ఎక్కడా నిల్వచేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మేజర్, మైనర్ కాలువల్లో అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు వీలుగా రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో 24 గంటల పాటు పని చేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. వర్షాలతో ఏమైనా అత్యవసర పరిస్థితుల తలెత్తినప్పుడు ప్రజలు కంట్రోల్ రూమ్‌కు ఫోన్- 9849907885 చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కమిషనర్ వెంట డీఈలు వెంకటరమణ, శ్రావణి, ఏఈలు ఉన్నారు.



తవణంపల్లె: వర్షంలోనే టమాట విక్రయించేందుకు వచ్చిన టెంపో

ఎడ తెరిపిలేని వాన

బంగారుపాళెం: మండలంలో శుక్రవారం రాత్రి నుంచే జడివాన పట్టుకుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడి ఫెంగల్ తుఫానుగా మారిన నేపథ్యంలో ఉదయం నుంచి ఎడతెరిపిలేని వర్షం పడుతూ ఉండడంతో. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఉదయం నుంచి ఆగకుండా పడుతున్న వర్షానికి వారపు సంత వెలవెలపోయింది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కూరగాయల విక్రేతలు, చిరువ్యాపారులు, తోపుడుబండ్లతో వ్యాపారాలు సాగించుకుని జీవనం సాగించుకునేవారికి తీవ్ర ఇబ్బందిగా మారింది. వ్యవసాయ పనులు చేసుకునే రైతులు, కూలీలు అవస్థలు పడ్డారు. ఒబ్బిడి చేసిన వరిపంట ఎండ పెట్టుకునేందుకు వీలుకాక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూలి చేసుకునే వారి పనులకు ఆటంకం కలగడంతో పనులు మానుకుని ఇళ్లకు పరిమితం అయ్యారు. చలిగాలులకు వృద్ధులు, చంటి పిల్లలు అవస్థలు పడ్డారు. రెండు రోజులు తుపాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో వరిసాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగాల్ తుపానుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ, తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఈ మేరకు సైక్లోన్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 8074172985ను సంప్రదించాలని తహసీల్దార్ కోరారు.

తవణంపల్లెలో 24.8 మి.మీ. వర్షపాతం

తవణంపల్లె: తుపాను ప్రభావంతో మండలంలో శనివారం ఉదయం నుంచి ఎడతెరపి లేని జడివాన కురిసింది. ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి ప్రజలు బయట తిరగలేక ఇళ్లకే పరిమితమయ్యారు. మండలంలో 24.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జడివానకు గ్రామీణ రోడ్లు బురదమయమయ్యాయి. మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై వర్షపునీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిపడ్డారు. అరగొండ కొత్త బస్టాండులో వర్షపు నీరు నిలిచి కుంటను తలపిస్తోంది. వర్షానికి పూత, పిందె దశలో ఉన్న కంది పంట దెబ్బతినే అవకాశం ఉంది. ఎడతెరపి లేకుండా వర్షంలో టమాటాలు రూ.100కు రెండు కిలోల చొప్పున విక్రయించారు.



బంగారుపాళెం: చిరు వ్యాపారుల అవస్థలు



బంగారుపాళెం: మార్కెట్ యార్డులో వరిధాన్యం తడవకుండా పట్ట కప్పిన దృశ్యం



చిత్తూరు: సంతపేట లిల్లీ బ్రిడ్జిని పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం

చిత్తూరు అర్బన్: స్వయం సహాయక మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని చిత్తూరు నగర మేయర్ ఎస్.అముద ఆకాంక్షించారు. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని గిరింపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను శనివారం మేయర్ అముద ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ, మహిళా సంఘాలు సమన్వయంతో, ఐకమత్యంతో పనిచేసి వ్యాపారాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. డ్వాక్రా సంఘాలు బలోపేతం చేయడానికి ప్రభుత్వం అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. అర్బన్ మార్కెట్లో మహిళా సంఘాలు ఏర్పాటుచేసిన పలు రకాలైన స్టాల్స్‌ను తిలకించారు. 40కు పైగా స్టాల్స్‌లో పోషకాహారాలు, పేపర్ గ్లాసులు, ప్లేట్లు, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు, డిజైనర్ దుస్తులు, అలంకరణ వస్తువులు, చేతితో తయారుచేసిన వివిధ రకాల వస్తువులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నరసింహ ప్రసాద్, సీఎంఎం రమణ, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, సీవోలు, ఆర్పీలు, పలువురు పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మెప్మా బజార్‌లో ఉత్పత్తులను మేయర్‌కు వివరిస్తున్న కమిషనర్

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

కాణిపాకం: పూతలపట్టు ప్రాంతాల్లో చోరీ చేసిన వ్యక్తిని పూతలపట్టు పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సీఐ కృష్ణమోహన్ కథనం మేరకు.. గత జూన్ 6వ తేదీన మండలంలోని కమ్మగుట్టపల్లి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ తాళాలు పగలగొట్టి సుమారు 10 కిలోల వెండి ఆభరణాలు, ఏడు గ్రాముల బంగారు నగలు దోచుకెళ్లారు. ఈ విషయమై పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. అలాగే ఏప్రిల్ నెలలో పూతలపట్టు నుంచి కాణిపాకం గ్రామానికి వెళ్లే మార్గంలో ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తి మెడలో 8 గ్రాముల బంగారు చైన్ చోరీ జరిగింది. ఈ చోరీపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. తిరుపతి జిల్లా పుత్తూరు పట్టణానికి చెందిన షేక్ మస్తాన్ (24) చోరీలకు పాల్పడినట్టు గుర్తించిన పోలీసులు కాపుకాచి పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి చోరీకి గురైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కాగా నిందితుడిపై తిరుపతి, వెదురుకుప్పం, కార్వేటినగరంతోపాటు, కర్ణాటక రాష్ట్రంలోని పలు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఆయన పేర్కొన్నారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని డీఈఓ వరలక్ష్మి కొనియాడారు. శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ విజయ ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ విద్యాశాఖలో అంకిత భావంతో విధులు నిర్వర్తించిన సీనియర్ అసిస్టెంట్ విజయ సేవలు మరువలేనివని అన్నారు. అంకిత భావంతో విధులు నిర్వహించి ఎలాంటి ఆరోపణలు లేకుండా ఉద్యోగ విరమణ పొందుతోందన్నారు. 32 సంవత్సరాలు సర్వీసులో మచ్చలేని మనిషిగా పనిచేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన సీనియర్ అసిస్టెంట్ విజయను దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్, ఏడీ వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది సత్య, గోపాల్, మురళి, రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ వరలక్ష్మి

ముగిసిన త్రోబాల్ పోటీలు



విజేతగా నిలిచిన చిత్తూరు బాలుర జట్టు

కాణిపాకం: పూతలపట్టు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-14 త్రోబాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో సాయంత్రం వరకు నువ్వా? నేనా? అన్నట్లు పలు జట్లు తలపడి ప్రతిభ కనబరిచాయి. బాలుర జట్టులో చిత్తూరు సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయస్థానంలో వైఎస్సార్ కడప, అలాగే బాలికల జట్టులో చిత్తూరు మొదటిస్థానం, రెండో స్థానంలో కర్నూలు నిలిచింది. విజేత జట్లకు అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వసంతవాణి, పీడీలు పాల్గొన్నారు.

తొప్పాతిపల్లెలో వైద్యసేవలు



వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

గుడిపాల: మండలంలోని తొప్పాతిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి సంధ్య 51 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులు తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు.

నవయుగ వైతాళికుడు గురజాడ

చిత్తూరు కలెక్టరేట్: నవయుగ వైతాళికుడు గురజాడ అని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు ఉషారాణి అన్నారు. ఆ కళాశాలలో శనివారం మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ పాత కొత్తల మేలు కలయికతో తెలుగు సాహిత్యానికి వినూత్న మార్గాన్ని గురజాడ చూపించారన్నారు. అతిథిగా విచ్చేసిన పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు వాసుదేవరెడ్డి మాట్లాడుతూ నాటి సమాజంలో కన్యాశుల్క దురాచారాన్ని ఖండిస్తూ గురజాడ రాసిన కన్యాశుల్కం నాటకం ప్రజల్లో మార్పుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సావిత్రమ్మ కళాశాల తెలుగు అధ్యాపకులు ధర్మమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

తవణంపల్లె: మండలంలో 8604 మందికి సామాజిక పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. మొత్తం 32 పంచాయతీల్లో శనివారం ఉదయం నుంచే సామాజిక పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. మండలంలోని 8,604 మందికి డబ్బులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన వారికి రెండవ రోజు అందజేస్తామన్నారు.

విద్యతోపాటు వివేకాన్ని అలవరచుకోవాలి

బంగారుపాళెం: విద్యార్థులు విద్యతోపాటు వివేకాన్ని పెంపొందించుకోవాలని సహస్రావధాని ఆముదాల మురళి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని శనివారం అమృత భారతి ఫౌండేషన్ సౌజన్యంతో విద్యార్థులకు ఉచితంగా రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు, జామెంట్రీబాక్సులు, స్వామి వివేకానంద రచనలతో కూడిన పుస్తకాలను పంపిణీ చేశారు. మురళి మాట్లాడుతూ, యువత ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని పట్టుదలతో సాధించాలన్నారు. తన పద్యాలతో విద్యార్థులను ఉత్తేజపరిచారు. అమృత భారతి ఫౌండేషన్ నిర్వాహకులు ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ, యువత స్వామివివేకానందుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో పయనించాలని సూచించారు. విద్యార్థులు చదవదలుచుకున్న మంచి పుస్తకాలను తెలియజేసినట్లైతే తాము వాటిని ఉచితంగా కొని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయులు నాగరాజనాయుడు, గంటామోహన్, పద్మజ, రోజారమణి, హరి, చరణ్ పాల్గొన్నారు.



దాతలు అందించిన విద్యాసామగ్రితో విద్యార్థులు

పార్టీలకు అతీతంగా పనిచేద్దాం..!

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మండలాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా పనిచేద్దామని ఎంపీపీ గీతా పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. తొలుత మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, చేపట్టబోయే పనుల వివరాలను అధికారులు సభలో వెల్లడించారు. ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని అధికారులు గుర్తించి త్వరితగతిన పరిష్కరించేలా చూడాలని ఎంపీపీ ఆదేశించారు. పల్లెల్లో సమస్యలు రాకుండా చూడాలన్నారు. వర్షపు సీజన్‌లో సీజనల్ వ్యాధులు రాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు జయరాం, రంజనీ, ఎంపీడీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను వివరిస్తున్న అధికారులు

స్క్రీనింగ్ పరీక్షలు సక్రమంగా నిర్వహించాలి

చిత్తూరు అర్బన్: చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ్ (ఆర్బీఎస్‌కే) ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు సక్రమంగా చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఆదేశించారు. నగరంలోని శరవణపురం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం జరుగుతున్న ఆర్బీఎస్కే స్క్రీనింగ్ పరీక్షలను కమిషనర్ తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు జరుగుతున్న తీరును, వివరాలను పరిశీలించారు. దీంతోపాటు ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని ప్రతి విద్యార్థికి స్క్రీనింగ్ పరీక్షలు చేయాలన్నారు. పిల్లలు, విద్యార్థుల ఆరోగ్య స్క్రీనింగ్ పరీక్షల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కమిషనర్ వెంట ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, ఏఎన్ఎం, ఐసీడీఎస్ అధికారులు ఉన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌కు కళ్లెం

గుడిపాల: క్యాన్సర్ మహమ్మారి ప్రస్తుతం చాపకింద నీరులా విస్తరిస్తోంది. జాతీయ కుటుంబ ఆరోగ్యశాఖ సర్వే ప్రకారం క్యాన్సర్‌ను ఆలస్యంగా గుర్తించడం మూలంగా అధిక మరణాలు సంభవిస్తున్నాయి. ఈ మహమ్మారిని ఎదుర్కోవాలంటే ముందస్తుగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయిస్తే ప్రాథమిక దశలోనే లక్షణాలు గుర్తించడం ద్వారా మరణాల సంఖ్యను తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. మహిళల్లో పలురకాల క్యాన్సర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని వారికి అవగాహన కల్పించి పరీక్షలు నిర్వహించాలని వైద్యులు చెబుతున్నారు. ఈ మహమ్మారిని అరికట్టేందుకు ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. సమాచారాన్ని నిక్షిప్తం చేయడానికి వైద్యారోగ్యశాఖ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఇంటింటికీ వెళ్లి నిర్వహిస్తున్న సర్వేను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి 18 ఏళ్లు నిండిన వారికి పలు రకాల ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. ఆరోగ్య సిబ్బంది స్కూళ్లల్లోనూ విద్యార్థులకు పరీక్షలు చేస్తున్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

స్క్రీనింగ్‌తో కనుగొనే ప్రయత్నం

ఒక వ్యక్తిలో క్యాన్సర్ కణాల కోసం శోధించడాన్నే స్క్రీనింగ్ అని పిలుస్తారు. ఆ వ్యక్తిలో క్యాన్సర్ ప్రభావిత లక్షణాలు ఉన్నాయా లేదా అనే విషయాలపై ఆరోగ్యశాఖ సిబ్బంది పరిశీలించి క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారు. ముందస్తు రోగ నిర్ధారణకు ఈ పరీక్షలు దోహదం చేస్తాయి. ప్రస్తుతం గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ సమగ్ర ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యక్తిగత వివరాలతో పాటు దీర్ఘకాలిక ఇతర వ్యాధులపై వైద్యసిబ్బంది ఆరా తీస్తారు. గతంలో సంక్రమించిన వ్యాధుల వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. చెడు అలవాట్లపై ఆరా తీస్తారు. మహిళల్లో సంక్రమించే గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ లక్షణాలను సైతం గుర్తిస్తారు. ఆరోగ్యశాఖ సిబ్బంది 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరి ఆరోగ్య సమస్యలు తెలుసుకొని యాప్ ద్వారా వివరాలు అప్‌లోడ్ చేస్తారు. దంత సమస్యలు నమోదు చేయడంతో క్యాన్సర్ దశను ప్రాథమిక అంచనా వేస్తారు. ప్రజలకు క్యాన్సర్ స్క్రీనింగ్‌పై ముందుగా అవగాహన కల్పిస్తారు.

సర్వేకి సహకరించాలి



క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలపై ఎలాంటి అపోహలు వద్దు. స్క్రీనింగ్‌తో ముందస్తుగా క్యాన్సర్ లక్షణాలను గుర్తించవచ్చు. ఎక్కువగా మహిళలు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్లతో బాధపడుతున్నారు. ఈ పరీక్షలతో సత్ఫలితాలు పొందవచ్చు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సిబ్బంది సర్వేకు సహకరించి పరీక్షలు చేయించుకోవాలి.

–డాక్టర్ సంధ్య,
మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ, గుడిపాల